క్లుప్తంగా

ఎంపీడీఓకు సన్మానం



సీతారామపురం: మండల నూతన ఎంపీడీఓ మారు బోయిన భాస్కర్‌ను మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు, గుండుపల్లి సర్పంచ్ చప్పిడి తిరుపతిరెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. పంచాయతీల అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఆర్థిక సాయం



సోమశిల: అనంతసాగరం మండలం పడమటి కంభంపాడు ఎస్సీకాలనీకి చెందిన నీరుకట్టు విజయలక్ష్మమ్మకు హెల్పింగ్ హార్ట్స్ సంస్థ సోమవారం ఆర్థిక సాయం అందజేసింది. గతంలో ఆవు దాడి చేయడంతో విజయలక్ష్మమ్మ తీవ్రంగా గాయపడింది. అప్పట్నుంచి ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతోంది. ఈ నేపథ్యంలో ఆమెకు రూ.10వేలు ఆర్థిక సాయం అందజేసినట్లు హెల్పింగ్ హార్ట్స్ సంస్థ వ్యవస్థాపకుడు రొండ్ల వెంకట రమణారెడ్డి తెలిపారు. సంస్థ సభ్యులు బొమ్మిశ్ల మురళి, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



జమ్మలపాలెంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

జలదంకి: మండలంలోని అన్ని పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. సోమవారం ఆయన జలదంకి మండలం జమ్మలపాలెం, జలదంకి, తొమ్మిదో మైలు, చినక్రాక గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపడుతున్న సీసీరోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.2.36 కోట్లతో సీసీరోడ్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ఎంపీపీ గోచిపాతల వెంకటరమణయ్య, టీడీపీ మండలాధ్యక్షుడు పులుగుంట మధురెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్యం లోపించకుండా చర్యలు

ఉదయగిరి: అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చర్యలు చేపట్టాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ అప్పాజీ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్షాలకు వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. వర్షాలకు వాగులు పొంగి ప్రవహించే అవకాశం ఉన్నందున ప్రజలు వాటి వద్దకు వెళ్లకుండా అవగాహన కల్పించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు కరిముల్లా, నాగూర్‌బీ, చంద్రశేఖర్, శ్రీనివాసులు, వెంకటరమణ, చినబాబు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శక్తి స్వరూపిణి నిమజ్జనం



ఉదయగిరి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని బాలాజీనగర్‌లో ఏర్పాటు చేసిన శక్తిస్వరూపిణి ప్రతిమ నిమజ్జన కార్యక్రమాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వాసుకి సుధాకర్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేకాలంకరణ చేసి ట్రాక్టర్‌పై కొలువుదీర్చి బాలాజీనగర్ నుంచి శివాలయం వరకు ఊరేగించారు. అనంతరం గండిపాళెం జలాశయం వద్దకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

పశుపోషకులు జాగ్రత్తలు పాటించాలి

వరికుంటపాడు : వర్షాలకు పశువులు, జీవాలకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున, వాటి నివారణకు పశుపోషకులు తగిన జాగ్రత్తలు పాటించాలని మండల ఇన్‌చార్జి పశువైద్యాధికారి ఎస్ రాఘవేంద్రశర్మ సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పశువుల పాకాల్లో చిత్తడి లేకుండా చూసుకోవాలని, బ్లీచింగ్ లేదా సున్నం చల్లాలని సూచించారు. దోమలు, ఈగల బెడద లేకుండా వేపాకు పొగ వేయాలన్నారు. పశువులు జీవాలను వర్షాల్లో మేతకు బహిరంగ ప్రదేశాలకు తీసుకెళ్లరాదని సూచించారు. కూలిపోయే స్థితిలో ఉన్న పాకాలు, గోడల పక్కన పశువులను కట్టి ఉంచరాదన్నారు. కాగా తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో దుత్తలూరు, వరికుంటపాడు మండలాల్లో సైక్లోన్ టీం ఏర్పాటు చేసినట్లు దుత్తలూరు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. దుత్తలూరు, వరికుంటపాడు పశువైద్యాధికారులతో పాటు మరో ఆరుగురు సిబ్బందిని నియమించామని వివరించారు. ఈ బృందం పశుపోషకులకు అందుబాటులో ఉంటుందన్నారు.

ఎడతెరిపి లేని వర్షం.. స్తంభించిన జనజీవనం

కావలి: కావలి నియోజకవర్గంలో సోమవారం భారీ వర్షం కురిసింది. కావలిలో 56.6, బోగోలు 47.2, దగదర్తి 44.4, అల్లూరు 79.8 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఆదివారం అర్ధరాత్రి నుంచి ఆకాశం మేఘావృతమై వర్షం మొదలైంది. మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. తీరప్రాంత గ్రామాల్లో మత్స్యకారులు వేట సామగ్రిని భద్రపరుచుకుని ఇళ్లకే పరిమితమయ్యారు. సముద్రం కసురు మీద ఉండి బలంగా గాలులు వీస్తూ అలలు ఎగిసి పడుతుండడంతో తీరం వైపు వెళ్లడానికి మత్స్యకారులు భీతిల్లుతున్నారు. కావలి ఆర్డీఓ ఎం వంశీకృష్ణ తీరప్రాంత గ్రామాల్లో పర్యటించి మత్స్యకారులతో మాట్లాడారు. అత్యవసర పరిస్థితులు తలెత్తితే తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. కాగా అధికారుల సూచనలను పాటిస్తూ జాగ్రత్తగా ఉండాలని కావలి నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సూచించారు.

ఉదయగిరిలో 67.6 మి.మీ వర్షపాతం

ఉదయగిరి: అల్పపీడన ప్రభావంతో ఉదయగిరిలో సోమవారం వేకువజాము నుంచి సాయంత్రం వరకు 67.6 మి.మీ వర్షపాతం నమోదైంది. వర్షం కారణంగా పట్టణంలో డ్రైనేజీలు పొంగిపొర్లాయి. వర్షపునీరు వీధుల్లో ప్రవహించడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన, రబీ సీజన్‌లో సాగుచేయనున్న పంటలకు వర్షం మేలు చేకూర్చింది.

వరికుంటపాడు: మండలంలో సోమవారం వేకువజాము నుంచి ఉదయం 8 గంటల వరకు 12.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. వర్షానికి ఉప్పుటేరు, పిల్లాపేరు సాగాయి. మూడ్రోజుల పాటు భారీ వర్షాలు పడుతాయనే హెచ్చరికలతో మండలాధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. ప్రస్తుతానికి మండలంలో ప్రమాదకర పరిస్థితులు ఏమీ లేవని అధికారులు తెలిపారు.

చెరువులు, వాగుల పరిశీలన

సీతారామపురం: అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు పడుతున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మర్రివ్వాట్ల రిజర్వాయర్‌తో పాటు చెరువులు, వాగులను ఎస్సై శివకృష్ణారెడ్డి సోమవారం పరిశీలించారు. దేవమ్మచెరువు పంచాయతీ పరిధిలోని వాగును పరిశీలించారు వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని, వాతావరణ శాఖ సూచనలను పాటించాలని ప్రజలకు సూచించారు.

కలిగిరి: మండలంలో సోమవారం వేకువజాము నుంచి మధ్యాహ్నం వరకు వర్షం పడింది. కలిగిరి పంచాయతీ పరిధిలో చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలపై పడడంతో తీగలు తెగిపోయి విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్మికులు ప్రజలకు ఇబ్బంది కలగకుండా వర్షపు నీరు ఇళ్ల మధ్యన నిల్వ లేకుండా బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టారు. వెంకన్నపాలెంలో జేసీబీ సాయంతో ప్రత్యేక కాలువలు తీయించి వర్షపు నీటిని బయటకు పంపించారు.

జలదంకి: మండలంలో సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భారీ వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేదు. వర్షానికి చెరువులు, పొలాల్లో కొద్దిపాటి నీరు చేరింది. మరో రెండు రోజులు భారీ వర్ష సూచనలు ఉండడంతో చెరువులు పూర్తి స్థాయిలో నిండే అవకాశం ఉందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

ఆత్మకూరు డివిజన్‌లో 172.6 మి.మీ వర్షపాతం

ఆత్మకూరు: ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో సోమవారం మధ్యాహ్నం వరకు 172.6 మి.మీల వర్షపాతం నమోదైనట్లు ఆర్డీఓ కార్యాలయ అధికారులు తెలిపారు. ఆత్మకూరు 162, ఏఎస్‌పేట 28.8, ఉదయగిరి 32.4, సీతారామపురం 10.8, మర్రిపాడు 27.4, కలువాయి 22.4, సంగం 12.8, అనంతసాగరం 12.4, చేజర్ల 9.2 మి.మీల చొప్పున నమోదైనట్లు వివరించారు.

చేజర్ల: మండలంలో సోమవారం వేకువజాము నుంచి వర్షం మొదలైంది. చేజర్ల, మడపల్లి, కోటితీర్థం, పెరుమాళ్లపాడు, ఆదూరుపల్లి, మాముడూరు గ్రామాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఎడగారు వరి కోతలు దాదాపు పూర్తవడంతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు.

మర్రిపాడు: మండలంలోని చుంచులూరు, పడమటి నాయుడుపల్లి గ్రామాల సమీపంలోని కాజ్‌వేలను ఎస్సై శ్రీనివాసరావు పరిశీలించారు. వర్షానికి కేతామన్నేరు ఉప్పొంగడంతో పరిశీలించి అప్రమత్తంగా ఉండాలని గ్రామస్తులకు సూచించారు. రెండు, మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని, వాగులు, వంకల వద్దకు రావద్దని సూచించారు. మర్రిపాడు వద్ద బొగ్గేరు వాగును పరిశీలించారు. అక్కడి సిబ్బందిని అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు.

సంగం: అల్పపీడన ప్రభావంతో మండలంలో సోమవారం భారీ వర్షం కురిసింది. వేకువజాము నుంచి మేఘాలు కమ్ముకుని ఎడతెరిపి లేకుండా వర్షం పడింది. మూడు రోజుల పాటు భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్న హెచ్చరికల నేపథ్యంలో మండల అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. ఆత్మకూరు ఆర్డీఓ భూమిరెడ్డి పావని, సంగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వేమారెడ్డి కోలగట్ల, వీర్లగుడిపాడు గ్రామాలను సందర్శించి అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వారి వెంట ఎంపీడీఓ షాలేట్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

రోడ్లు జలమయం

అనుమసముద్రంపేట: అల్పపీడన ప్రభావంతో మండలంలో భారీ వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లో రోడ్లు జలమయమయ్యాయి. ఏఎస్‌పేటలో ప్రధాన రహదారి పూర్తిస్థాయిలో మునిగిపోయింది. దీంతో ద్విచక్రవాహనచోదకులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బస్టాండ్ సెంటర్ వద్ద రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీలు లేవు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న స్థలం ఆక్రమణకు గురవడంతో వర్షపు నీరు రోడ్డుపై నిలిచి చిన్నపాటి చెరువును తలపించింది. ఇటీవల జమ్మవరంలో సిమెంటు రోడ్డు నిర్మించారు. ఇరువైపులా డ్రైనేజీని నిర్మించకపోవడంతో వర్షపునీరు రోడ్డుపైనే నిలిచిపోయింది. దీంతో స్థానికులు కాలువలు తవ్వుకుని వర్షపు నీటిని తొలగించుకున్నారు.

బీరాపేరును పరిశీలించిన ఆర్డీఓ

కొండమీదకొండూరు వద్ద బీరాపేరు వాగును ఆత్మకూరు ఆర్డీఓ భూమిరెడ్డి పావని పరిశీలించారు. మూడ్రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని గ్రామస్తులకు సూచించారు. నెల్లూరు– ముంబై రహదారి నుంచి గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారి జలమయమై జలదిగ్బంధంలో చిక్కుకునే అవకాశం ఉండడంతో అధికారులను అప్రమత్తం చేశారు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని తమకు అందించాలని అధికారులను ఆదేశించారు. ఆమె వెంట తహసీల్దార్ శ్రీరామకృష్ణ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



కావలిలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



ఉదయగిరిలో వర్షం



సంగం: వీర్లగుడిపాడులో పర్యటిస్తున్న ఆత్మకూరు ఆర్డీఓ, సంగం సీఐ



కావలి: తుమ్మలపెంట వద్ద తీరాన్ని పరిశీలిస్తున్న కావలి ఆర్డీఓ వంశీకృష్ణ



కలిగిరిలో నేలకొరిగిన చెట్టును తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది



అనుమసముద్రంపేట: జమ్మవరంలో రోడ్డుపై నిలిచిన నీటిని తొలగిస్తున్న స్థానికులు



సంగంలో వర్షం



కావలి: తీరంలో వలలను భద్రపరుచుకుంటున్న మత్స్యకారుడు



అనుమసముద్రంపేట: బీరాపేరును పరిశీలిస్తున్న ఆత్మకూరు ఆర్డీఓ



సీతారామపురం: దేవమ్మచెరువు వద్ద వాగు చప్టాను పరిశీలిస్తున్న ఎస్సై శివకృష్ణారెడ్డి



మర్రిపాడు: కేతామన్నేరు వాగును పరిశీలిస్తున్న ఎస్సై శ్రీనివాసరావు



కలిగిరి: వెంకన్నపాలెంలో వర్షపు నీటిని పంపేందుకు జేసీబీతో కాలువ తీస్తున్న దృశ్యం

వర్షంతో వరి రైతు విలవిల

సోమశిల: ఆరుగాలం శ్రమకోర్చి పండించిన వరి పంట చేతికందే సమయంలో వర్షం పాలవడంతో రైతులు విలవిల్లాడుతున్నారు. అనంతసాగరం మండలంలోని బెడుసుపల్లి, లింగంగుంట, పాతదేవరాయపల్లి, కొత్తపల్లి తదితర గ్రామాల్లోని రైతులు ఎడగారు పంట సాగుచేశారు. గత పది రోజులుగా కోతలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో అడపాదడపా కురుస్తున్న చిరుజల్లులు వరికోతలకు తీవ్ర ఆటంకం కలిగించాయి. రైతులు కోతలను నిలిపివేసి కోసిన ధాన్యాన్ని ఆరబెట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలోనే అల్పపీడన ప్రభావంతో ఆదివారం అర్ధరాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం పడడంతో వందల ఎకరాల్లోని పంట నేలవాలింది. కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలకు వేలు పెట్టుబడులు పెట్టి పండించిన పంట నేలపాలవడంతో తీవ్రంగా నష్టపోయామని, ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



ధాన్యాన్ని ప్లాస్టిక్ పట్టలతో కాపాడుకుంటున్న రైతులు

పెన్నా తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ఆత్మకూరురూరల్ :అప్పారావుపాళెం ఎస్టీకాలనీ వాసులతో మాట్లాడుతున్న ఆర్డీఓ పావని



వింజమూరు: అధికారులతో సమీక్షిస్తున్న తహసీల్దార్ హమీద్



ఆత్మకూరు: సచివాలయ సిబ్బందితో సమీక్షిస్తున్న కమిషనర్ గంగా ప్రసాద్



బిట్రగుంట: వర్షాలపై సమీక్షిస్తున్న తహసీల్దార్ సురేష్‌కుమార్



అల్లూరు: మత్స్యకారులకు సూచనలు చేస్తున్న తహసీల్దార్ లక్ష్మీనారాయణ



సోమశిల: ప్రజలకు సూచనలు చేస్తున్న సీఐ గంగాధర్

ఆత్మకూరురూరల్: అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పెన్నా నది తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు ఆర్డీఓ భూమిరెడ్డి పావని సూచించారు. మండలంలోని పెన్నానది పరివాహక ప్రాంతాలైన అప్పారావుపాళెం, కొత్తపాళెం, ఎస్టీ కాలనీల్లో సోమవారం ఆమె పర్యటించారు. స్థానిక పరిస్థితులను ప్రజలను అడిగి తెలుసుకుని సూచనలు చేశారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం తరుపున అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామ, మండల స్థాయిలో అధికారులు అందుబాటులో ఉన్నారని, అత్యవసర పరిస్థితులు తలెత్తితే సమాచారం అందించిన వెంటనే సాయం అందజేస్తారని తెలిపారు. కాగా అప్పారావుపాళెం ఎస్టీకాలనీకి చెందిన పది కుటుంబాల వారిని స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ సుధీర్, ఆర్ఐ పృథ్వీకుమార్, తదితరులు ఉన్నారు.

ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా చర్యలు

వింజమూరు(ఉదయగిరి): మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సయ్యద్ హమీద్ అధికారులతో సమావేశమయ్యారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రానున్న మూడ్రోజుల పాటు వింజమూరు మండలంలో అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందన్న హెచ్చరికల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలపై సమీక్షించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వింజమూరు ప్రాంతంలో అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని జిల్లా అధికారులు ముందస్తు సమాచారం అందజేశారని చెప్పారు. రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ప్రాణ, ఆస్తినష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లోని ప్రజలను ముందస్తుగా అప్రమత్తం చేయాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. డీటీ శ్రీనివాసరావు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వార్డు సచివాలయాల్లో సహాయక కేంద్రాలు

ఆత్మకూరు: అల్పపీడన ప్రభావంతో మూడ్రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో వార్డు సచివాలయాల్లో సహాయక కేంద్రాలను ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్ సూచించారు. మున్సిపల్ కార్యాలయంలోని ఎంజీఆర్ సమావేశ మందిరంలో సోమవారం ఆయన సచివాలయ సిబ్బందితో అత్యవసర సమావేశం నిర్వహించారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందస్తుగా గుర్తించి పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. మున్సిపల్ ఆర్ఐ షాజహాన్, తదితరులు పాల్గొన్నారు.

సముద్రంలోకి వేటకు వెళ్లొద్దు

అల్లూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ లక్ష్మీనారాయణ సూచించారు. మండలంలోని ఇస్కపల్లిలో సోమవారం ఆయన పర్యటించారు. సముద్ర తీరాన్ని పరిశీలించి మత్స్యకారులకు సూచనలు చేశారు. రెండ్రోజుల పాటు సముద్రంలోకి వేటకు వెళ్లొద్దని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమును ఏర్పాటు చేశామని, అన్ని శాఖ అధికారులు అందుబాటులో ఉంటారని చెప్పారు. ఏదైనా అత్యవసర సాయం అవసరమైతే 99899 31792 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నష్టం తలెత్తకుండా ముందస్తు చర్యలు

బిట్రగుంట: భారీ వర్షాల నేపథ్యంలో ఎటువంటి నష్టం జరగకుండా అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సురేష్‌కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వర్షాలపై సోమవారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. శుక్రవారం వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఎటువంటి నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ముంపు ప్రాంతాలు, లోతట్టు గ్రామాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తీరప్రాంత గ్రామాల పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైతే మత్స్యకార గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు.

మర్రిపాడు: అల్పపీడన ప్రభావంతో మూడ్రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ స్వప్న సూచించారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. వర్షం కురిసే సమయంలో అత్యవసరమైతే తప్ప బయట తిరగవద్దని ప్రజలకు సూచించారు. పొలం పనులకు వెళ్లే వారు చెట్ల కింద ఉండొద్దని, విద్యుత్ స్తంభాలు, మోటార్ల వద్దకు వెళ్లవద్దని తెలిపారు. వర్షాలు ఆగేంత వరకు పాడిరైతులు తమ పశువులను ఇంటి వద్దే ఉంచుకోవాలని సూచించారు. పశువులకు అత్యవసర వైద్యసేవలు అవసరమైతే 1962 నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు. వాగుల సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాగులు పొంగితే అత్యవసర సాయం అవసరమైతే తమకు సమాచారం అందించాలని కోరారు. మండల కార్యాలయంలో అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, అవసరమైన సహాయక చర్యలు చేపడుతారని తెలిపారు.

సోమశిల: అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు సీఐ గంగాధర్ సూచించారు. అనంతసాగరం మండలంలోని పెన్నా పరివాహక ప్రాంత గ్రామాలను సోమవారం ఆయన సందర్శించారు. ప్రజలకు సూచనలు చేశారు. ఆత్మకూరు–సోమశిల రోడ్డులో ముత్తుకూరు సమీపంలోని కొమ్మలేరు చప్టా, అనంతసాగరం–చిలకలమర్రి మార్గంలో గౌరవరం సమీపంలో ఉన్న చప్టాను పరిశీలించి వాగులు ఉధృతంగా ప్రవహించే సమయంలో దాటవద్దని వాహనదారులకు సూచించారు. తహసీల్దార్ వీరవసంతరావు పెన్నా తీర గ్రామాల్లో పర్యటించి ముంపు పరిస్థితులు ఎదురైతే పునరావాస కేంద్రాలకు తరలిస్తామని తెలిపారు.

లోలెవల్ చప్టాలు.. హైలెవల్ టెన్షన్



ఏఎస్‌పేట మండలం తెల్లపాడు వద్ద చప్టాపై ప్రవహిస్తున్న కలుజు వాగు (ఫైల్)



మర్రిపాడు మండలం పెగళ్లపాడు వద్ద చప్టాపై ప్రవహిస్తున్న బొగ్గేరు (ఫైల్)

- వాగులు ఉప్పొంగితే నిలిచిపోతున్న రాకపోకలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామీణ ప్రాంత ప్రజలు

అనుమసముద్రంపేట: ఆత్మకూరు నియోజకవర్గంలోని పలు గ్రామాలకు వర్షం పడి వాగులు ఉప్పొంగితే రాకపోకలు నిలిచిపోతున్నాయి. వాగులపై హైలెవల్ బ్రిడ్జిలు లేని కారణంగా ఈ పరిస్థితి నెలకొంటోంది. వర్షాకాలంలో వాగులు రోజుల తరబడి చప్టాలపై ప్రవహిస్తుండడంతో అత్యవసర పరిస్థితుల్లో గ్రామీణ ప్రాంత ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో పెన్నానదితో పాటు ప్రధానంగా బొగ్గేరు, బీరాపేరు, కొమ్మలేరు, కేతామన్నేరు, వాటికి అనుసంధానంగా చిన్నచిన్న వాగులు, ఏటికాలువలు ఉన్నాయి. వర్షాలు అధికంగా కురిస్తే వాగులు పొంగి చప్టాలపై ప్రవహించి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. వాగులు పొంగిన సమయంలో ఎవరూ దాటవద్దని అధికారులు హెచ్చరించడమే తప్పా శాశ్వత పరిష్కారానికి మాత్రం చర్యలు తీసుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. గతంలో వాగులు పొంగి రోజుల తరబడి ఇబ్బందులు ఎదుర్కొన్న సంఘటనలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ఏఎస్‌పేట–ఆత్మకూరు మార్గంలో తెల్లపాడు సమీపంలో కలుజువాగు ఉంది. ఈ వాగు పొంగి చప్టాపై ప్రవహిస్తే ఏఎస్‌పేట– ఆత్మకూరు నడుమ రాకపోకలు నిలిచిపోతాయి. ఈ మార్గంలోని గ్రామాల ప్రజలు ఏఎస్‌పేట మండల కేంద్రానికి చేరుకోవాలంటే చుట్టూ తిరిగి రావాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ఏఎస్‌పేట– హసనాపురం రోడ్డులోని నక్కల వాగు పొంగితే చిరమన, జమ్మవరం, కాకర్లపాడు, గుంపర్లపాడు, హసనాపురం గ్రామస్తులు మండల కేంద్రానికి రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.
- ఆత్మకూరు మండలం బండారుపల్లి సమీపంలో కేతామన్నేరు వాగు పొంగి చప్టాపై ప్రవహిస్తే గ్రామస్తులు రోజుల తరబడి జలదిగ్బంధంలో చిక్కుకోవాల్సిన పరిస్థితి. ఈ గ్రామానికి సమీపంలోనే పెన్నానదితో పాటు బొగ్గేరు, కేతామన్నేరు వాగులు ఉండడంతో వర్షాకాలంలో గ్రామస్తుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది. అదే విధంగా కొట్టాలు ఎస్సీ కాలనీ, అప్పారావుపాళెం–వీర్లగుడిపాడు గ్రామాల మధ్యన రాకపోకలు నిలిచిపోతాయి.
- మర్రిపాడు మండలంలో కేతామన్నేరు వాగు పొంగితే చుంచులూరు, కదిరినాయుడుపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. పడమటినాయుడుపల్లికి ఇరువైపులా ఉన్న గ్రామాల ప్రజలకు రాకపోకలకు ఇబ్బందే. బొగ్గేరు ప్రవాహంతో పెగళ్లపాడు, రాజులపాడు, సన్నవారిపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి.
- అనంతసాగరం మండలంలోని కొమ్మలేరు వాగు పొంగితే కచిరిదేవరాయపల్లి వద్ద రాకపోకలకు ఇబ్బంది కలుగుతుంది. రేవూరు సమీపంలోని సాగు నీటి కాలువ పొంగితే రేవూరు, కొమ్మలేరు వాగు పొంగితే ముత్తుకూరుకు రాకపోకలు పూర్తిస్థాయిలో నిలిచిపోతాయి.
- సంగం మండలంలో బీరాపేరు వాగు పొంగితే చెన్నవరప్పాడు, పెరమన గ్రామాలకు పూర్తిస్థాయిలో రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఉంది. అంతేకాకుండా పెన్నానదికి భారీస్థాయిలో నీరు చేరి దిగువకు విడుదల చేస్తే కోలగట్ల, వీర్లగుడిపాడు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. ఎన్నో ఏళ్లుగా ఆయా గ్రామాల ప్రజలు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు.
- చేజర్ల మండలం పుల్లనీళ్లపల్లి వద్ద ఏటికాలువ పొంగి చప్టా మీదకు నీరు చేరితే గ్రామానికి రాకపోకలు నిలిచిపోతాయి. యనమదల–భిల్లుపాడు–మడపల్లి మధ్యన ఉన్న నల్లవాగు ఉధృతంగా ప్రవహిస్తే ఆయా గ్రామాల నడుమ రాకపోకలు నిలిచిపోతాయి. తూర్పుకంభంపాడు వద్ద నల్లవాగు, గొల్లపల్లి వద్ద పంగలవాగు, చేజర్లకండ్రిక వద్ద రెడ్డిగుంట వాగులు ప్రవహిస్తే ఆయా గ్రామాలకు రాకపోకలు పూర్తిస్థాయిలో నిలిచిపోతాయి. వాగులపై ఉన్న లోలెవల్ చప్టాల కారణంగా ఎన్నో ఏళ్లుగా గ్రామీణ ప్రాంత ప్రజలు వర్షాకాలంలో రాకపోకల సమస్యలను ఎదుర్కొంటున్నా శాశ్వత పరిష్కారం మాత్రం లభించడం లేదు. ప్రభుత్వం స్పందించి చప్టాల స్థానంలో హైలెవల్ బ్రిడ్జిలను నిర్మిస్తే భవిష్యత్తులో రాకపోకల సమస్యలు పూర్తిస్థాయిలో ఉండవని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.



అనంతసాగరం మండలంలో చప్టాపై ప్రవహిస్తున్న కొమ్మలేరు వాగు (ఫైల్)